సాక్షి
జగిత్యాల
సోమవారం । 6 । నవంబర్ । 2023

జిల్లాకు చేరిన ఎన్నికల పరిశీలకులు



జగిత్యాల: ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్‌ఏఎస్ అధికారి శీల్ ఆశిష్ జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవో నరసింహామూర్తి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయన జిల్లాలోని ధర్మపురి, బుగ్గారం, చిన్నాపూర్, గొల్లపల్లి, జగిత్యాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టి, విఎస్‌టి టీంల పనితీరును పరిశీలించారు. పలు పార్టీల ప్రచార వాహనాల అనుమతి పత్రాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

11న విశ్వరూప మహాసభ



విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఈనెల 11న హైదరాబాద్‌లో విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కో–కన్వీనర్ బెజ్జంకి సతీశ్‌మాదిగ అన్నారు. తుంగూర్‌లో విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల చంద్రయ్య, జూల లక్ష్మణ్, విష్ణు, జూల రమేశ్, శ్యాం, మహిళలు పాల్గొన్నారు.

బోర్నపెల్లిలో రూ.81వేలు పట్టివేత

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామ చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.81వేలు పట్టుబడ్డాయని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఎలాంటి రశీదు లేకుండా డబ్బులు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి వాటిని స్వాధీనం చేసుకుని గ్రీవెన్ సెల్‌కు అప్పగించామని ఎస్సై తెలిపారు.

ఉదారత చాటుకున్న 'ఎల్లాల'

- రూ.1.20 లక్షల ఆర్థిక సాయం



యువకుడికి ఆటోను అందిస్తున్న ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: ఓ నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడికి ఆర్థికంగా చేయూతనిచ్చారు ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి. ధర్మపురికి చెందిన మజీద్ శ్రీలక్ష్మీనృసింహ ఆటో యూనియన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కోవిడ్ సమయంలో ఎంతోమందికి సాయం అందించాడు. అతడి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి అతడి జీవనోపాధి కోసం రూ.1.20 లక్షల ఆర్థికసాయం అందించారు. ఆ డబ్బుతో ఓ ఆటోను కొనిచ్చి తన ఉదారత చాటుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డి చూపించిన చేయూత పట్ల ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఖాజా అమ్జత్ అలీ, కౌన్సిలర్ యూనస్, బీఆర్ఎస్ నాయకులు ఆసిఫ్, ఇక్రమ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పద్మశాలీ అభ్యర్థిని బరిలో దింపుతాం



మాట్లాడుతున్న రుద్ర శ్రీనివాస్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో పద్మశాలీల తరఫున అభ్యర్థిని బరిలో నిలిపేందుకు సంఘం నాయకులు తీర్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ తెలిపారు. కోరుట్లలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంఘం అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు అభ్యర్థిని నిలిపేందుకు సమ్మతించారని పేర్కొన్నారు. పద్మశాలీలు అంతా ఏకతాటిపై నిలిచి పద్మశాలీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న వ్యక్తికి మద్దతుగా నిలవాలన్నారు. సమావేశంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్, నాయకులు గడ్డం మధు, కోరుట్ల పట్టణ కన్వీనర్ గుంటుక చంద్రప్రకాశ్, కౌన్సిలరు ఎంబేరి నాగభూషణం, గుడ్ల మనోహర్, ముల్క ప్రసాద్, గుండేటి రాజశేఖర్, జిందం లక్ష్మీనారాయణ, చాప కిశోర్, జిల్లా ధనుంజయ్, గుడూరి తిరుపతి, బోగ గంగాధర్, చాట్ల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దతు తెలుపుతున్న సంఘం నాయకులు

జ్వరాలు తగ్గవు.. బెడ్లు దొరకవు

- పాత బస్టాండ్ వద్ద జనరల్ ఆసుపత్రి
- అందుబాటులో ఉండడంతో రోగుల తాకిడి
- ఇక్కడ 130 బెడ్లు ఉన్నా సరిపోని వైనం
- ధరూర్‌లో మాతా శిశు సంరక్షణ కేంద్రం
- మూడు కిలోమీటర్ల దూరం వెళ్లలేక జనం అవస్థలు

జగిత్యాల: జిల్లాను విషజ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలు ప్రబలుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు.



జగిత్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఇక్కడ కొన్ని.. అక్కడ కొన్ని..

కిన్ని విభాగాలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో.. మరికొన్ని ధరూర్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఉండటంతో రోగులకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన సిబ్బంది కొందరిని మతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలిస్తే ఇబ్బందులు తప్పే అవకాశముంది. మాతాశిశు సంక్షేమ కేంద్రానికి ఓల్డ్ బస్టాండ్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వైద్యులు సైతం వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ విధులు వేసినా.. నిబంధనల ప్రకారం సిబ్బంది వెళ్లాల్సి ఉంటుంది. కానీ.. కొందరు వైద్య సిబ్బంది పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనరల్ ఆసుపత్రిలో రోగుల తాకిడి పెరగడంతో ఇటీవల కొందరు రోగులను కింద పడుకోబెట్టి చికిత్స అందించారని ఆరోపణలు వచ్చాయి. దీంతో మాతాశిశు కేంద్రంలోని పై అంతస్తులో జనరల్ మెడిసిన్‌కు సంబంధించి 30 బెడ్లను ఏర్పాటు చేశారు. అయితే వైద్యులంతా జనరల్ ఆసుపత్రిలోనే ఉండడంతో అక్కడ రోగులను చూసేవారు లేరు. ఈ క్రమంలో జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన కొంతమంది వైద్యులను అక్కడకు పంపించాలని ప్రజలు కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల ఆసుపత్రులు..

జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుకు ముందు జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద 100 పడకల ఆస్పత్రి ఉండేది. వైద్య కళాశాల ఏర్పడటంతో ఈ ఆస్పత్రిలో మరో 30 పడకలు పెంచారు. మరోవైపు ధరూర్ క్యాంప్‌లో రూ.17 కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 200 వరకు బెడ్లు ఏర్పాటుచేశారు. వైద్య కళాశాల నామ్స్ ప్రకారం 330 బెడ్లు ఉండాల్సి ఉండగా.. రెండు ఆసుపత్రుల్లో 330 బెడ్లు ఉన్నాయి. పాత బస్టాండ్ వద్దగల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, డెంటల్, ఎమర్జెన్సీ విభాగాలు కొనసాగుతున్నాయి. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో గైనకాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ, అస్తమాలజీ, సైకియాట్రిక్ విభాగాలు కొనసాగుతున్నాయి. జనరల్ ఆసుపత్రి పాత బస్టాండ్ వద్ద అందుబాటులో ఉండడంతో రోగులు ఇక్కడికే వెళ్తున్నారు. అయితే ఇక్కడ 130 పడకలు మాత్రమే ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడకు ప్రతిరోజూ వెయ్యికి పైగా ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. సుమారు 200కు పైగా వివిధ రోగాలతో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు.

అన్నీ ఉన్నా...

జిల్లాకేంద్రంలో 330 బెడ్ల వరకు అందుబాటులో ఉన్నా.. ఆసుపత్రులు రెండుచోట్ల ఉండడం.. కొన్ని విభాగాలు అక్కడ, కొన్ని విభాగాలు ఇక్కడ ఉండటంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. 330 బెడ్స్ ఒకేచోట ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కావు. ఓల్డ్ బస్టాండ్‌లో ప్రాంతంలోనే ప్రభుత్వ ఆస్పత్రి ఉండటంతో చుట్టూరా మండలాల నుంచి వచ్చే ప్రజలకు ఇది సౌకర్యవంతంగా ఉంది.



వరండాలోనే చికిత్స పొందుతున్న రోగులు

86మందికి పైగా సిబ్బంది

వైద్య కళాశాలలో 86 మంది సిబ్బంది కొనసాగుతున్నారు. ఇందులో 11మంది ప్రొఫెసర్లు, ఎనిమిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 30 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 37మంది సీనియర్ రెసిడెన్సీలు ఉన్నారు. పీజీ వారు 30, అవుట్ సర్జన్స్ 8 మంది ఉన్నారు. వీరు అక్కడ, ఇక్కడ విధులు నిర్వర్తిస్తే పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. వైద్య సిబ్బంది అంతా పాత ఆస్పత్రిలోనే విధులు నిర్వర్తిస్తుండడంతో సమస్య తలెత్తుతోంది.

కొన్ని విభాగాలు తరలిస్తాం

మాతాశిశు సంక్షేమ కేంద్రంలో చాలా విభాగాలున్నాయి. జనరల్ మెడిసిన్ విభాగం పాత ఆస్పత్రిలో ఉంది. విష జ్వరాలు ఎక్కువ కావడంతో రోగుల తాకిడి ఎక్కువైంది. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో 30 బెడ్స్‌ను ఏర్పాటు చేసి జనరల్ మెడిసిన్‌కు వచ్చే రోగులను అక్కడకు పంపించే ఏర్పాట్లు చేస్తాం.
– రాములు, ఆస్పత్రి సూపరింటిండెంట్



మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. అందుకే దేవుడిమీద కానీ.. మహానుభావుల మీదకాని ఆధారపడొద్దు.– బీఆర్ అంబేడ్కర్

మీకు తెలుసా?

సహకార నేతకు తప్పని ఓటమి

కరీంనగర్: జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ముల్కనూర్ కో–ఆపరేటివ్ బ్యాంకు అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపకులైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన అల్గిరెడ్డి కాశీవిశ్వనాథ్‌రెడ్డి(హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తండ్రి) హుజూరాబాద్ శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల రాజేశ్వర్‌రావు చేతిలో ఓటమి చెందగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దుగ్గిరాల వెంకట్‌రావు చేతిలో రెండవసారి ఓటమి పాలయ్యారు.

1989 ఎన్నికల్లో స్వతంత్రులదే హవా

కరీంనగర్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో 1989లో ఉమ్మడి జిల్లాలో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించి ఔరా అనిపించారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా వెలిచాల జగపతిరావు, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కేతిరి సాయిరెడ్డి, బుగ్గారం ఎమ్మెల్యేగా జువ్వాడి రత్నాకర్‌రావు, సిరిసిల్ల ఎమ్మెల్యేగా నీరడి వెంకటక్రిష్ణయ్యలు గెలుపొందారు. కరీంనగర్, హుజూరాబాద్, బుగ్గారం కాంగ్రెస్ టికెట్ల కోసం పోటీ పడి టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా పై ముగ్గురు పోటీకి దిగి విజయం సాధించారు. సిరిసిల్లలో మాత్రం సీపీఐ(ఎంఎల్)జనశక్తి మద్దతుతో ఎన్.వీ క్రిష్ణయ్య విజయం సాధించి అప్పట్లో సంచలనం సృష్టించారు.



జైపూర్‌లో తెలంగాణ ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన



గొల్లపల్లి:రాజస్థాన్‌లోని జైపూర్‌లో 26వ లోక్‌రంగ్ జాతీయ నృత్య మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన 25మంది కళాకారులు ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 26వరకు జరిగే లోక్‌రంగు జాతీయ నృత్య ప్రదర్శన మహోత్సవంలో భాగంగా రాష్ట్రం నుంచి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బోనాలు, కోలాటం, ఒగ్గుడోలు విన్యాసాలు ఎంపికయ్యాయి. ఒగ్గుడోలు విన్యాసంలో భాగంగా గొల్లపల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన పర్వతాలు, శివకుమార్, రవీందర్, కుమారస్వామి, రాజశేఖర్, శ్రీకాంత్, 25 మంది కళాకారులు ఒగ్గుడోలు, ఘటన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు పలువురి ఆకట్టుకున్నాయి.

ఎన్నికల ఖర్చుపై ఈసీ నిఘా..!

జంగ్ తెలంగాణ

- అభ్యర్థులూ పారాహుషార్..
- వ్యయం వివరాలు సక్రమంగా ఉండాల్సిందే..
- లేకుంటే అనర్హత వేటే

జగిత్యాల: శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయాన్ని పరిశీలించేందుకు జిల్లాకు ప్రత్యేకాధికారులను ఎన్నికల సంఘం నియమించింది. ఎవరైతే అసెంబ్లీకి పోటీ చేస్తున్నారో.. వారు తప్పకుండా ఖర్చుల వివరాలు, ఖాతాలను సక్రమంగా నిర్వహించాలి. ఖర్చులు సక్రమంగా చూపించని అభ్యర్థులపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ ఎంతమొత్తం ఖర్చు చేస్తున్నామనేది బ్యాంక్ ఖాతాల్లో చూపించాల్సి ఉంటుంది. నామినేషన్‌కు ఒకరోజు ముందు బ్యాంక్ ఖాతా తీసి వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యర్థి నామినేషన్ వేసిన నుంచి నగదు, జమ ఖర్చులన్నీ ఆ ఖాతా నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా ఖాతాల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ఖర్చులకు సంబంధించి ఎన్నికల సంఘం సమయం కూడా ఇస్తుంది. ఆ సమయం లోపు తప్పకుండా వారికి తెలియజేయాలి. ఒకవేళ అభ్యర్థులు ఎలాంటి లెక్కలు చూపకపోతే వారిపై మూడేళ్ల పాటు అనర్హత వేటు పడుతుంది.

జాగ్రత్తగా ఉండాలి

నామినేషన్లు వేసే అభ్యర్థులు వ్యయాన్ని సక్రమంగా చూపడంతో పాటు, నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అన్ని వివరాలను తప్పకుండా పొందుపర్చాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లు వేసే సమయంలో ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు ఏమైనా ఉంటే వాటిని సైతం నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఎలాంటి కాలం పూర్తి చేయకున్నా నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ముందు నుంచే ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

పెరిగిన వ్యయం

2018 అసెంబ్లీ ఎన్నికల్లో గరిష్ట పరిమితి రూ.28 లక్షలు ఉండగా.. ఈ ఎన్నికల్లో రూ.40 లక్షల వరకు పెంచారు. కార్యకర్తల భోజనాల నుంచి కాన్వాయి, ప్రచార వాహనాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి ధరలు పెంచడంతోపాటు, ఆయా లెక్కల ప్రకారమే అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారా..? లేదా..? అన్నది ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. ఏదైనా లెక్కల్లో తేడాలు కన్పిస్తే అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. గతంలో కంటే ఈసారి పకడ్బందీగా వ్యయ పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ప్రత్యేక బృందాలు చేరుకున్నాయి. వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్, అకౌంటింగ్, జిల్లా ఆడిట్ కంట్రోల్, వ్యయ పరిశీలన కమిటీ బృందాలన్నీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటాయి.



జగిత్యాలకు వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలకులు

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం

- దాతల సహకారంతో ఏర్పాటు
- నిర్వహణ కరువై నిరుపయోగంగా..
- లక్షలాది రూపాయలు వృథా
- ఎన్నికలవేళ ఎంతో కీలకం

బుగ్గారం: దొంగతనాలు, దోపిడీలు, అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు, దోపిడీలూ జరుగుతున్నాయి. కొందరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆలయాలు, ఇళ్లలో చోరీలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజల్లో భయాందోళన పెరిగిపోతోంది. శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో నేరాలను అదుపు చేసి శాంతిభద్రతలను కాపాడడంలో భాగంగా పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. ఇలా 2018లో డీజీపీ మార్గనిర్దేశనం మేరకు ప్రజల భాగస్వామ్యంతో పట్టణాలు, గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ‹నేను సైతం› అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా బుగ్గారం మండలంలోని 11 గ్రామాల్లో పలువురు ఎస్సైల ఆధ్వర్యంలో ఇప్పటివరకు 76 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల విధుల్లో చేరిన ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రజల భాగస్వామ్యంతో మరో 11 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అయితే సీసీ కెమెరాల ఏర్పాటులో ఉత్సాహం కనబర్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు కాలం గడిచేకొద్దీ వీటి నిర్వహణ పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం కనబర్చడంతో ప్రస్తుతం అనేక గ్రామాలలో కెమెరాలు పనిచేయడం లేదు.



బుగ్గారంలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు



• గ్రామస్తుల సహకారం.. పోలీసుల పర్యవేక్షణ

గ్రామాల్లో ఎక్కడ.. ఏం జరిగినా తక్షణమే పోలీసులకు తెలియడానికి మండలంలోని 11 గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో సగటున 5 నుంచి 6 కెమెరాలు ఏర్పాటు చేసి స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో వీటిని మానిటరింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం పోలీసు అధికారులు కల్పించిన అవగాహనతో గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్నారైలు, పలువురు గ్రామ పెద్దలు తమకు వీలైనంతగా ఆర్థిక సాయం అందించారు. దీంతో నేరాలు జరిగినప్పుడు దర్యాప్తులో పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. అలాగే కెమెరాలు ఉన్నాయనే భయంతో ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు కొంత భయంతో ఉండడం మొదలైంది.

• చెడిపోయిన కెమెరాలు

కెమెరాలు ఏర్పాటు చేసిన కొంతకాలానికి కోతులతో కొన్ని.. వర్షాలతో మరికొన్ని కెమెరాలు పనిచేయకుండా పోయాయి. మండలంలో ప్రస్తుతం దాదాపుగా అన్ని గ్రామాలలోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన కెమెరాలు నిరుపయోగంగా మారడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి చెడిపోయిన కెమెరాలకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

• ఎన్నికలవేళ ఎంతో కీలకం

ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా మారాయి. వివిధ సభలు, సమావేశాలు జరుగుతున్నప్పుడు అల్లర్లు చెలరేగిన సందర్భంలో నిందితులను గుర్తించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇటీవలే దసరా ఉత్సవాలలో గోపులాపూర్ గ్రామంలో రెండు వర్గాలు ఘర్షణకు దిగి.. కర్రలతో దాడిచేసుకునే వరకూ వెళ్లిది. అలాగే మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల లో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా స్థానిక కార్యాలయాల నిర్మాణంపై తమ అసంతృప్తిని వివరించడానికి గ్రామస్తులు అంతా ఒక్కసారిగా మంత్రి చుట్టూ గూమిగూడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇలాంటి సందర్భాల్లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే సీసీ కెమెరాలే ఎంతో ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తక్షణమే వినియోగంలోకి తేవాలి



నేరాల అదుపునకు.. దర్యాప్తులో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాలు ప్రస్తుతం పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. వీటిని బాగుచేయించి వినియోగంలోకి తేవాలి. ఎప్పటికప్పుడు వీటి నిర్వహణ పట్ల తగిన చర్యలు తీసుకోవాలి.
–జంగ శ్రీనివాస్, బుగ్గారం

మరమ్మతుకు చర్యలు



గ్రామాల్లో కొన్ని కెమెరాలు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరగా వాటికి మరమ్మతు చేయించి వినియోగంలోకి తెస్తాం. దాతల సహకారంతో నూతన కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తాం. గ్రామస్తులు కూడా వీటి నిర్వహణకు ముందుకు రావాలి.
– అశోక్, ఎస్సై

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



రేణుశ్రీని అభినందిస్తున్న హెచ్‌ఎం విమల

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రేణుశ్రీ ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. అండర్– 14 ఖోఖో విభాగంలో, 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆదివారం ప్రధానోపాధ్యాయురాలు విమల, సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పరశురాం అభినందించారు.

నాటుసారా స్థావరంపై దాడి



బెల్లంపానకం పారబోస్తున్న పోలీసులు

మల్యాల(చొప్పదండి): మండలంలోని రాజారం గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 5 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లంపానకం పారబోశారు. తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న శివరాత్రి మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం



రమేశ్(ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరి రమేశ్ (38) గల్ఫ్‌లో మృతిచెందగా ఆదివారం మృతదేహం ఇంటికి చేరింది. గ్రామస్తుల వివరాలు.. రమేశ్ ఉపాధి నిమిత్తం 17 నెలల క్రితం బెహరాన్ వెళ్లాడు. ఇటీవల సాయంత్రం పూట రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. అతడి మిత్రులు వెంటనే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి అంత్యక్రియలు పూర్తి చేశారు.

విప్లవవీరుల పెద్దపల్లి

- ఎన్నికలపై నక్సల్స్ ప్రభావం
- తొలి ఎమ్మెల్యే పీడీఎఫ్ అభ్యర్థి
- శ్రీరాంసాగర్ జలాలతో 'వరి' సిరులు
- ఎస్సారెస్పీ కాలువపై జల విద్యుత్ కేంద్రాలు
- పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ముఖచిత్రం



పెద్దపల్లిరూరల్: విప్లవవీరులను అందించిన పెద్దపల్లికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష ఉద్యమానికి ఊపిరులూదిన మల్లోజుల సోదరులు కిషన్‌జీ ఉరఫ్ మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దపల్లి బిడ్డలే. వీరేకాకుండా అనేక మంది అగ్రనేతలుగా ఎదిగారు.

పెత్తందారీ వ్యవస్థపై పోరు

- అప్పటి పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు) పార్టీ పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక ప్రభావం చూపేది.
- ఈక్రమంలోనే పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు సాగించింది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారి పెద్దపల్లిలో డీఎస్పీ స్థాయి అధికారి బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ హతమార్చడం సంచలనం సృష్టించింది.
- పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి 1952లో జరిగిన తొలిఎన్నికల్లో ఎల్.ముత్తయ్య పీడీఎఫ్ నుంచి పోటీచేసి విజయం సాధించారు.

తొలి ఎన్నికలు 1952లో..

1952లో అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఇప్పటి వరకు 15సార్లు ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారితం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అందే సాగునీటితో వరి సిరులు కురిపిస్తోంది. ఎస్సారెస్పీ డీ–83 ప్రధానకాలువ పెద్దపల్లి నుంచి మంథనికి, డీ– 86 ద్వారా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని దాదాపు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అంతేకాదు.. కాలువలపై ఆరు చోట్ల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి.

వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్..

- పెద్దపల్లిలో వందేళ్ల క్రితమే రైల్వేస్టేషన్ అందుబాటులోకి వచ్చింది.
- ఈప్రాంత రైతులు అత్యధికంగా వేరుశనగ, కంది సాగుచేసేవారు. వరంగల్ తర్వాతి స్థానంలో అతిపెద్ద మార్కెట్‌గా పెద్దపల్లికి ఇప్పటికీ గుర్తింపు ఉంది.

ఓటర్ల తీర్పు విలక్షణం..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పెద్దపల్లి ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చేవారు. వరుసగా రెండోసారి ఎవరినీ ఎన్నుకునేవారు కాదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో టీఆర్‌ఎస్ నుంచి దాసరి మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. 2018లోనూ ఆయనే విజయం సాధించి గతరికార్డులను బద్దలు కొట్టారు. మూడోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు బరిలో నిలిచారు.

'గోనె' ప్రత్యేక ముద్ర

1983లో జరిగిన పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షమైన సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరుమాసాలకే తన పదవికి రాజీనామా చేసిన గోనె ప్రకాశరావు.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటినుంచి నేరుగా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ ఆయనను ఆర్టీసీ చైర్మన్‌గా నియమించారు.

1952 నుంచి 2018 వరకు ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	ఎల్.ముత్తయ్య	పీడీఎఫ్
1962	బుట్టి రాజారాం	కాంగ్రెస్
1967	జిన్న మల్లారెడ్డి	స్వతంత్ర
1972	జిన్న మల్లారెడ్డి	కాంగ్రెస్
1978	గొట్టిముక్కుల రాజిరెడ్డి	కాంగ్రెస్
1983	గోనె ప్రకాశ్‌రావు	సంజయ్ విచార్‌మంచ్
1983	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1985	కాల్వ రామచంద్రారెడ్డి	టీడీపీ
1989	గీట్ల ముకుందరెడ్డి	కాంగ్రెస్
1994	బిరుదు రాజమల్లు	టీడీపీ
1999	గుజ్జుల రామకృష్ణారెడ్డి	బీజేపీ
2004	గీట్ల ముకుందరెడ్డి	టీఆర్‌ఎస్
2009	విజయరమణారావు	టీడీపీ
2014	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్‌ఎస్
2018	దాసరి మనోహర్‌రెడ్డి	టీఆర్‌ఎస్

కాంగ్రెస్ అభ్యర్థిగా 'గీట్ల'

పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గీట్ల ముకుందరెడ్డి తొలుత సంజయ్ విచార్ మంచ్ అభ్యర్థి గోనె ప్రకాశ్‌రావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత అనూహ్యంగా గోనె ప్రకాశ్‌రావు తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికల్లో సమీప టీడీపీ అభ్యర్థి వేముల రమణయ్యపై గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీపడ్డారు. 2004 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయరమణారావు చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన గీట్ల ముకుందరెడ్డిని కాదని భానుప్రసాదరావుకు పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యారు.

బాబ్బాబు.. జర నా మాట విను!

- నేతలు దిగివచ్చిన వేళ.. ఎన్నికల సిత్రాలు

కోరుట్ల: ఏమైందిరా రాజు.. ఎన్నడు లేంది ఇయ్యాల మన చిన్న లీడరు ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఎక్కడున్నడో ఏమో.. గీ ఎలచ్చన్ల ఏమన్న ఎంజాయ్ చేద్దామంటే దొరుకుతలేదేందిరా.. అంటూ తన దోస్తుని పలకరించిండు శ్రీను. గీ పలకరింపుతో ఇద్దరు జర దూరంగా పోయి గుసగుస మొదలెట్టింద్రు. గ ముచ్చట సంగతేంటో తెలుసుకుందాం.



రాజు: ఏమైందిరా శీను ఒక్కసారిగా గా మందిలకెళ్లి నన్ను మూలకు పట్టుకొచ్చి ముచ్చట మొదలెట్టిన్..?

శ్రీను: అరె రాజు గీ ముచ్చట అందరిలో చెప్పేది కాదురా. వారం నుంచి మనూరి చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు. నేను కూడా మస్తుసార్ల కొట్టిన. ఎందుకు కలుస్త లేదో తెలుసా..?

రాజు: ఎందుకు ఫోన్ కలుస్తులేదని నిన్ను అడిగితి. మళ్లీ నాకెట్లా తెలుస్తది నువ్వే చెప్పు ఎం కథనో..?

శ్రీను: ఇగో ఎవల్లతోని అనకు గానీ మన చిన్న లీడరు పార్టీ మారుదమని చూస్తున్నడు. ఇది తెలిసి ఇప్పుడున్న పార్టీ మనుషులు గీ ఎలచ్చన్ల టైమ్‌లో ఎట్ల మారుతవ్ అని మస్తు ఒత్తిడి తెస్తుంద్రు. గందుకే మనోడు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ పెట్టి చుట్టాలింటికి పోయిండు.

రాజు: గట్లనా ఇప్పుడున్న పార్టీకి ఏమైందిరా, ఎందుకు మారుతడట. గీ ముచ్చట నాకు ఎప్పుడు ఇనవడలే..?

శ్రీను: ఏడాది నుంచి మన చిన్న లీడరు వాళ్ల పార్టీ పెద్ద సారును ఓ పని అడిగితే గాయిన నానబెట్టుకుంట వచ్చిండట. మందికి ఏం చేసినా చేయకపోయినా సరే కానీ నేను చెప్పిన పని కాకపోయే అని అలిగి ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టి వేరే పార్టోళ్లతోటి మంతనాలు మొదలెట్టిండని తెలిసింది.

రాజు: అవునా మరి నాకైతే ఏం తెల్వలే. మొన్న మన చిన్న లీడరు పార్టీ పెద్ద సారు మన ఊరికి వచ్చిండు గానీ ఆయన ప్రచారం కోసం వచ్చిండని అనుకున్నా.

శ్రీను: ప్రచారం లేదు ఏం లేదు. మన చిన్న లీడరు పార్టీ ఎక్కడ ఇడిసిపెడతడోనని వాళ్ల పార్టీ పెద్దసారు గడిబిడ అయిండు. మన చిన్న లీడరుకు ఫోన్ చేస్తే కల్వలేదు. డొటచ్చి పెద్ద లీడరు సీదా మనోని ఇంటికి వెళ్లిండు. గప్పుడు మనోడు గా ముచ్చట..గీ ముచ్చట చెప్పి మూడు గంటలు బతిమాలిచ్చుకున్నడు. చివరికి ఇద్దరు కలిసి పళ్లికిలిచ్చుకుంట ఓ ఫొటో దిగింద్రు. గప్పుడు పెద్ద లీడరు మనసు తిరమైంది.

రాజు: గీ ముచ్చటంత నాకు తెల్వకపోయే. పార్టీ పెద్ద సారు వచ్చి మూడు రోజులాయే, మరి ఇంకా మన చిన్న లీడరు ఫోన్ కలుస్తలేదు కదా..?

శ్రీను: ఇగో..గీడ మరో తిరకాసు జరిగింది. చిన్న లీడరు పార్టీకి చెందిన పెద్ద లీడరు వచ్చి మాట్లాడి పోయిండో లేదో గీ ముచ్చట తెలిసి ఎక్స్‌పార్టీ లీడరు వెంటనే మనోని ఇంటికి వచ్చిండు. అగో మాతోని వస్తనని అంటివి కదా..మా పార్టీలోకి రా..అనంగనే మనోడు మళ్లీ బతిమాలించుకుని ఎక్స్‌పార్టీ లీడరుతో పళ్లికిలిచ్చుకుంట ఫొటోలు దిగిండు. ఇగ ఆ తర్వాత గీ తలనొప్పి ఎందనుకుని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిండు. ఎట్లయితే ఏందిరా..ఎన్నడు రాని పెద్ద లీడర్లను మనోడు ఇంటికి రప్పించుకున్నడు, బతిమాలించుకున్నడు.

రోజుకు రూపాయే!

- ఓటును అమ్మేస్తే వచ్చే ఫలితమిదే..

పెగడపల్లి(ధర్మపురి): ఓటు వజ్రాయుధంలాంటిదని చెప్పవచ్చు. ఒక్క ఓటుతో అభ్యర్థుల తలరాతలు మార్చవచ్చు. అలాంటి ఓటును అమ్ముకుంటే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించినవారవుతారు. ఐదేళ్లు ప్రశ్నించే హక్కును కోల్పోయినట్లే. అదేలాగంటే.. ఎన్నికలు సమీపించే కొద్ది కొందరు అభ్యర్థులు ప్రచార శైలిని మార్చేస్తారు. ఓటర్లకు డబ్బు ఎర చేస్తారు. ఒక్కో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల ఇచ్చేందుకు తెగిస్తారు. ఓటర్లతో ప్రమాణాలు చేయించుకుంటారు. ఈ మానసిక బలహీనతను వారు గుప్పిటపడతారు. రోజుకు కేవలం ఒక్క రూపాయితోనే ముందు ప్రశ్నించే హక్కును కాల రాసేస్తారు. ఉదాహరణకు ఒక్క ఓటును రూ.2 వేలకు అమ్ముకున్నారనుకోండి. రాబోయే ఐదేళ్లు అంటే 1,825 రోజులకు గానూ రోజుకు ఇచ్చే డబ్బు ఎంతో తెలుసా..అక్షరాల రూపాయే (రూ.1.09). మీరే లెక్కేసుకోండి. రోజువారీ కూలీ వేతనంతో ఇది ఎన్నోవంతో మీకే తెలిసిపోతుంది. కార్మికులు, కూలీలకు కనీసం రోజు కూలీ కూడా పడదు. అదే ఆ రూపాయి అతడి వద్ద తీసుకోకుండా ఉంటే అదే ప్రజాప్రతినిధి వద్దకు ధైర్యంగా వెళ్లవచ్చు. మీరు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరవచ్చు. అదే డబ్బులు తీసుకుంటే.. అతడి కాళ్ల కింద ఓటు హక్కును పడేసినట్లే. కనీసం వారి ముందు నిలబడే అర్హత లేనట్టే.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



గంగాధర్ మృతదేహం

చొప్పదండి: మండలంలోని రాగంపేట శివారు పందివాగు సమీపంలో ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మల్యాల మండలానికి చెందిన బాసవేని చిన్న గంగాధర్ (40) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ ఇటీవలే గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఆర్నకొండలోని బంధువుల ఇంటికి వచ్చి మ్యాడంపల్లికి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా రాగంపేట గ్రామంలో ఇసుకను అన్‌లోడ్ చేసి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో గంగాధర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిలలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీట్ ఆఫీసర్‌కు తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఇప్పపెల్లి శివారులో ఆదివారం రాత్రి టాటా ఏస్ వాహనం బైక్‌ను ఢీకొట్టగా అటవీశాఖ బీట్ ఆఫీసర్ కారం శ్రీనివాస్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ పోతారం బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇప్పపెల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు



గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్

ఇల్లందకుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పోలీసులకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలో జరిగింది. ఎస్సై రాజకుమార్ వివరాల ప్రకారం.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోల్ట్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బైరి శ్రీనివాస్, హోంగార్డ్ రాజేందర్‌ప్రసాద్ బైక్‌పై సిరిసేడు గ్రామం నుంచి ఇల్లందకుంటకు వస్తుండగా మార్గమధ్యలో ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ కాలు, చేయి విరగగా, రాజేందర్‌ప్రసాద్ కాలి మడిమ వద్ద గాయమైంది. ఎస్సై రాజకుమార్ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. గాయపడినవారిని ఏసీపీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కిషోర్, పట్టణ సీఐ రమేశ్ పరామర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గం



రాజేశం



రాజగంగారం

కోరుట్ల: పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎనుగంటి రాజేశం, ప్రధాన కార్యదర్శిగా రాపల్లి రాజగంగారాం, ఉపాధ్యక్షులుగా తాండూరు శ్రీనివాస్, నేతూరి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడిగా చెన్నా విశ్వనాథంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అరవై ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పట్టణంలో 4,500 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని, రూ.500 కోట్లతో జిల్లా కేంద్రంలో 650 పడకలతో ఆస్పత్రి, మెడికల్ కళాశాల మంజూరు చేయించామని, 100 పడకల కొత్త ఆస్పత్రి, సెంట్రల్ లైటింగ్, బీట్‌బజార్ అత్యాధునిక హంగులతో సమీకృత మార్కెట్, చల్‌గల్ వ్యవసాయ మార్కెట్, మోతె చెరువు, కండ్లపల్లి చెరువు, చింతకుంట చెరువులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రతి రోడ్డును బాగుచేశామని, గతంలో గెలిచిన వారు ఎందుకు చేయలేదో చెప్పాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

రాయికల్(జగిత్యాల): నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పుమడుగు, అయోధ్య, కైరిగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపెల్లి రాణి, సర్పంచులు ఎద్మల జీవన్‌రెడ్డి, కైరం ముత్తయ్యగౌడ్, నాయకులు కొండల్‌రెడ్డి, వెంకన్న, బర్కం మల్లేశ్‌యాదవ్, వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు. సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలో మైనార్టీలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ మహేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇర్ఫాన్‌అలీ, నాయకులు హుస్సేన్, నయీం, బాబా, మన్సూర్, రహీం, మొహీద్, బీఆర్‌ఎస్ యూత్ పట్టణాధ్యక్షుడు మోర రామ్మూర్తి, కేటీఆర్ సేవాసమితి సభ్యులు ముజ్జు, ఖలీద్ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కష్టపడి పనిచేయండి

సారంగాపూర్(జగిత్యాల): బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్పూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు బీర్‌పూర్ ఆలయ చైర్మన్ నేరెల్ల సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

సంజయ్‌కు మున్నూరుకాపుల మద్దతు

మున్నూరుకాపులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను బలపరచి, గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో జడ్పీచైర్‌పర్సన్ పాల్గొని ప్రసంగించారు. మున్నూరుకాపులు తీర్మానించిన కాపీని స్వీకరించారు. ఎంపీపీలు కోల జమున, ములాసపు లక్ష్మీ, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు. కాగా మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో గందరగోళం ఏర్పడింది. ఇతర కులాల ప్రజాప్రతినిధులు కొందరు వేదికపైకి వెళ్లడంతో కాపు సంఘం నాయకులు అభ్యంతరం తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పేర్కొనడం సరికాదన్నారు. దీంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్‌ఎస్ మినహా ఇతర పార్టీల నాయకులు సమావేశం నుంచి బయటకు వచ్చారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు



పట్టుబడిన మద్యంతో సీఐ, సిబ్బంది

తిమ్మాపూర్(మానకొండూర్): ఎన్నికల కోడ్ నేపథ్యంలో నాటుసారా, గంజాయి, గుడుంబా, అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం నల్లగొండ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మార్క రాములు తన ద్విచక్ర వాహనంపై 24 మద్యం బాటిళ్లు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. విచారణ చేస్తే అక్రమ మద్యం రవాణా చేస్తున్నాడని తెలుసుకొని వాహనంతో పాటు మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడితే 87126 58810 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సీఐ వెంట ఎస్సై సరిత, సిబ్బంది కొండల్‌రెడ్డి, రజిత, సురేశ్ తదితరులున్నారు.

దుక్కి దున్నకుండానే మక్క సాగు



జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసిన పొలాల్లో దుక్కి దున్నకుండా యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు రైతులను మండల వ్యవసాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలోని రాయికల్, మేడిపల్లి, సారంగాపూర్ మండలాల్లో అత్యధికంగా ఈ పద్ధతిలో సాగు చేస్తుంటారు. దీంతో రైతులకు దుక్కి దున్నే ఖర్చు తగ్గడంతో పాటు పంటమార్పిడి వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి..

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

గొల్లపల్లి: మండలంలోని చెందోళి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఆత్రం సాయికుమార్ (24) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన సాయికుమార్ వరుసకు తమ్ముడైన శడమాకి నాగబాబుతో కలిసి జగిత్యాలలో పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో చందోళి శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి కిందపడ్డారు. ఈ క్రమంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. సాయికుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.